ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
సోమవారం 4 మార్చి 2024



ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి 6లో..

రామగుండంలో బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్ 6లో..



టార్గెట్ బీఆర్ఎస్

- స్థానిక సంస్థల ప్రతినిధులకు కాంగ్రెస్ గాలం
- ఇప్పటికే మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు వశం
- రామగుండం కార్పొరేషన్‌పై గురి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులను కాంగ్రెస్ పార్టీలో నాయకులు చేర్చుకున్నారు. మిగతా ప్రజాప్రతినిధులు, నాయకులను సైతం పార్టీలో చేర్చుకునేందుకు ఆ పార్టీ నేతలు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులందరినీ కాంగ్రెస్ పార్టీలోకి తీసుకవచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. తాము గెలవడమే గాకుండా పార్టీ కూడా రాష్ట్రంలో అధికారంలోకి రావడం, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంత్రి కావడంతో ఎమ్మెల్యేలకు మరింత బలం చేకూరింది. స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉండడంతో వాటిపై దృష్టి సారించిన నాయకులు ఎట్టకేలకూ మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నారు. మంథని మున్సిపాలిటీలో 13 మంది కౌన్సిలర్లు ఉండగా, ఇద్దరు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన వారున్నారు. చైర్‌పర్సన్‌గా ఉన్న పుట్ట శైలజ, వైస్‌చైర్మన్‌ను పదవి నుంచి తప్పించేందుకు మంత్రి పావులు కదిపారు. ఏడుగురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై ఆవిశ్వాసం పెట్టి నెగ్గారు. సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాసం పెట్టారు. బీఆర్ఎస్‌కు చెందిన్ గాజుల లక్ష్మి చైర్‌పర్సన్‌గా ఎన్నికైన కొన్ని గంటలకే ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ బీఆర్ఎస్ బలం ఎనిమిది తగ్గింది. అయితే గాజుల లక్ష్మి బాటలో మరికొంత మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరే విధంగా వారితో మంతనాలు జరుగుతున్నాయని తెలుస్తున్నది.

● పెద్దపల్లి మున్సిపాలిటీలో...

పెద్దపల్లి మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉండగా ఐదుగురు మాత్రమే కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు చెందిన అమ్రిష్, ఎరుకల కల్పన, ఉప్పు స్వరూప, పాగాల సోనీ, కొలిపాక శ్రీనివాస్, కొలిపాక సంధ్య, కొమిరిశెట్టి కనకలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల తర్వాత పైడ పద్మ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో మున్సిపల్‌లో కాంగ్రెస్ బలం 13కు చేరుకున్నది. ఇక్కడ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టాలంటే 19 మంది కౌన్సిలర్లు వారికి వ్యతిరేకంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అవిశ్వాసంపై సమావేశానికి కోరం 23 మంది కౌన్సిలర్లు హాజరుకావాలి. మరో పది మంది కాంగ్రెస్ గూటికి వస్తే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడం ఖాయం. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సంసిద్ధంగా ఉన్నప్పటికీ, వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తామని హామీ ఇస్తేనే చేరతామనే షరతు విధించినట్లు సమాచారం.ఈ విషయమై ఎలాంటి హామీ ఇవ్వలేమని ఎమ్మెల్యే చెప్పినట్లు తెలుస్తున్నది. ముందుగా పార్టీలో చేరాలని, పరిస్థితిని బట్టి ఆలోచన చేస్తామని వారికి చెప్పినట్లు తెలిసింది.

మేయర్ సహా పలువురు కార్పొరేటర్లు..

రామగుండం కార్పొరేషన్ మేయర్ డాక్టర్ అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్‌పై కూడా సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్లే అవిశ్వాస ప్రయత్నాలు చేశారు. వారిని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిలువరించారు. అయితే తానే కాంగ్రెస్ పార్టీలో చేరితే అవిశ్వాస గండం నుంచి తప్పించుకోవచ్చని భావించిన మేయర్ మరికొందరు పార్టీ కార్పొరేటర్లతో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ రూ.100కోట్లు మంజూరు చేయించడంతో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి స్వయంగా మేయర్ కాంగ్రెస్ నేతలతో కలిసి క్షీరాభిషేకం చేయడం గమనార్హం. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని తేలిపోయింది. ఆదివారం మేయర్ సహ పలువురు కార్పొరేటర్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌లను కలిసేందుకు వెళ్లారు, చేరికలపై ముహూర్తం ఖరారు చేయనున్నట్లు సమాచారం. మున్సిపాలిటీలను హస్తగతం చేసుకోవడంతో పాటు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు కూడా కాంగ్రెస్‌లో చేరే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కసరత్తు చేస్తున్నారు.

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



పోలియో చుక్కలు వేస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పోలియో సోకకుండా వారి నిండు జీవితానికి రక్షణగా తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం ఆయన మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి పిలలకు పోలియో చుక్కలువేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలియో చుక్కలు వేయుటకు 381 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 4040 పోలియో వాయిల్స్‌ను అన్ని కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు. బస్‌స్టేషన్, రైల్వే ప్రాం గణాల్లో సైతం 24 పోలియో ట్రాన్సిట్ కేంద్రాలను ఏర్పాటుచేశామని, జిల్లాలో వలస కార్మికులు, ఇటుక బట్టీలు, నిర్మాణ కార్మికుల కోసం 149ప్రాంతాలను గుర్తించి అక్కడికి 24మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేస్తారని, వీటిని వినియోగించుకుంటూ 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ప్రభుత్వఆసుపత్రిలో వార్డులను తనిఖీలు చేసి రోగులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితులను, హాస్పిటల్ సదుపాయాల అడిగితెలుసుకున్నారు. ఆసుపత్రి పరిశుభ్రంగా ఉంచుతూ, రోగులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె ప్రమోద్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీఎస్‌టీపీపీని జాతికి అంకితమివ్వనున్న ప్రధాని



తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు

జ్యోతినగర్, మార్చి 3 : రామగుండంలోని ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టిఎస్‌టిపిపి) స్టేజ్1ను సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితంచేయనున్నారు. 1600మెగావాట్ల(800 మెగావాట్ల2 యూనిట్లు) మొదటి దశకు సంబంధించి ఆదిలాబాద్ నుంచి ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. 10వేల కోట్ల రూపాయలతో నిర్మించిన టీఎస్‌టీపీపీ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 85 శాతం తెలంగాణకే సరఫరా చేస్తారు. 2016లో శంకుస్థాపన జరిగిన ఈ ప్రాజెక్టు 2023లో మొదటి యూనిట్, 2024లో 2వ యూనిట్ ఉత్పత్తి దశలోకి వచ్చాయి. రెండురోజుల క్రితం 800 మెగావాట్ల 2వ యూనిట్‌ను కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్(సీవోడీ)గా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధాని మోదీ టీఎస్‌టీపీపీని జాతికి అంకితం చేస్తారు. కాగా, తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే సందర్భంగా ఎన్టీపీసీ పీటీఎస్‌లోని కాకతీయ ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధాని కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రాజెక్టుకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొంటారు.

కరీంనగర్ నుంచే బీఆర్ఎస్ ఎన్నికల శంఖారావం

- 12న ఎస్సారార్ కళాశాల మైదానంలో బహిరంగ సభ - హాజరు కానున్న కేసీఆర్ - కరీంనగర్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్ - పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్ పేర్ల ప్రకటన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ కరీంనగర్ నుంచే శంఖం పూరించనున్నది. తన సెంటిమెంట్ జిల్లా అయిన కరీంనగర్ నుంచే ఈసారి కూడా ప్రచారం ప్రారంభిస్తే శుభం జరుగుతుందని భావించిన కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ నేతలతో జరిగిన సమావేశంలో వెల్లడించారు. కరీంనగర్ నుంచి రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేస్తారని కేసీఆర్ ప్రకటించారు. వినోద్‌కుమార్ ఇప్పటికే నియోజక వర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ నేతల ముఖ్య శ్రేణుల సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు సమాయత్తం చేస్తు కార్యాచరణను వారిముందు ఉంచారు. పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పుడు అధికారికంగా ఆయన పేరును ప్రకటించారు. వినోద్‌కుమార్ కరీంనగర్ అభ్యర్థిగానే ఇప్పటికే ప్రచారం జరుగుతుండగా, పెద్దపల్లి నియోజక వర్గ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ పేరును ఇప్పుడు ఖరారు చేశారు.

బోయినపల్లి వినోద్‌కుమార్ 2014లో కరీంనగర్ ఎంపీగా గెలిచారు. కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా ఎంపిక చేయించారు. జాతీయ రహదారులు, కొత్తపల్లి మనోహరాబాద్ రైలు మార్గ నిర్మాణ పనులు చేపట్టించడానికి ఆయన ఎంపీగా కృషి చేశారు. 2019లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ చేతిలో పరాజయం పాలయ్యారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వెన్నంటి ఉండి వినోద్‌కుమార్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జాతీయ స్థాయిలో వివిధ పార్టీల మద్దతు కూడగట్టడంలో క్రియాశీల పాత్ర నిర్వహించారు. 2004లో హన్మకొండ పార్లమెంట్ నియోజక వర్గం నుంచి ఎంపీగా గెలుపొందిన వినోద్‌కుమార్ ఉద్యమ కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు 2008 మార్చి3న కేసీఆర్‌తో కలిసి ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఉద్యమ కాలంలో ప్రతి కీలక ఘట్టంలోనూ కేసీఆర్‌కు అండగా నిలుస్తూ వచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సలహాలు ఇస్తూ రాష్ట్రాన్ని ముందుకు నడిపించడంలో క్రియాశీల



హైదరాబాద్‌లో సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

పాత్ర నిర్వహించి బీఆర్ఎస్‌లో ముఖ్య నేతగా ఎదిగారు. ఈ క్రమమే ఆయనను మళ్లీ ఇప్పుడు అభ్యర్థిగా ఎంపిక చేయడానికి కారణమైంది.

పెద్దపల్లి నియోజక వర్గ ఎంపీగా ఉన్న బోర్లకుంట వెంకటేశ్‌నేత ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక్కడ నుంచి మాజీ ఎంపీ, ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోటీలో దింపుతారని భావించారు. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ పార్టీ అధినేత ఈశ్వర్‌ను తెరపైకి తెచ్చారు. ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గ ఎమ్మెల్యేగా గెలుపొందే వరకు ఈశ్వర్ గోదావరిఖనిలో కార్మిక నాయకుడిగా ఉండే వారు. ఆయనకు రామగుండం నియోజక వర్గంతో పాటు మంచిర్యాల, బెల్లంపల్లి నియోజక వర్గాల్లో కార్మికులతో సత్సంబంధాలు ఉన్నాయి. ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గంలో ఎమ్మెల్యేగా మంత్రిగా పట్టు సాధించుకున్న ఆయనకు నేరుగా పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని రామగుండం మంచిర్యాల, బెల్లంపల్లి చెన్నూరు, ధర్మపురి నియోజక వర్గాల్లో కార్మిక నేతగా సంబంధాలు ఉన్న వ్యక్తిగా లోక్ సభ అభ్యర్థిగా పోటీలోకి దిగనున్నారు. మంథని, పెద్దపల్లి నియోజక వర్గాలు కూడా ఈ పార్లమెంటు నియోజక వర్గ పరిధిలోనే ఉన్నాయి. కొప్పుల ఈశ్వర్‌ను రంగంలోకి దింపడం ద్వారా బలమైన పోటీ ఇవ్వవచ్చని బీఆర్ఎస్ నాయకత్వం భావించి స్థానికుడైన ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు భావిస్తున్నారు.

ఎస్సారార్ కళాశాల మైదానం నుంచి ప్రచారానికి శ్రీకారం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈనెల 12న ఎస్సారార్ కళాశాల మైదానంలో జరగనున్న భారీ బహిరంగ సభలో పాల్గొనడం ద్వారా లోక్ సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన నియోజక వర్గ నేతలతో ఆయన చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. బహిరంగ సభకు కరీంనగర్, పెద్దపల్లి నియోజక వర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యేలా చూడాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మండల స్థాయిలో పార్టీ నేతల సమావేశాలు ఏర్పాటు చేయాలని, బస్సు యాత్రలు నిర్వహించాలని కూడా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోలను నిర్వహించాలని నిర్ణయించారు. రోడ్ షోలలో తాను పాల్గొంటానని కేసీఆర్ నేతలకు హామీ ఇచ్చారని సమాచారం.

ఓదెల మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి



ఓదెల జాతరలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, మార్చి 3 : ఓదెలలోని భ్రమరాంబ శ్రీమల్లికార్జున స్వామి జాతరలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మల్లికార్జునస్వామికి భక్తులు బోనాలను సమర్పించి, కోడేలతో మొక్కులు చెల్లించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులంతా తరలివచ్చి ఆలయంలో బోనాలు, పెద్ద పట్నాలు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం బ్రహ్మోత్సవాలు, ఉగాది పండుగ ఉన్నందున క్షేత్రంలో భక్తుల రద్దీ పెరుగుతోంది.

కార్పొరేషన్ ఆదాయం పెంపుపై పట్టింపేది?

- రూ.3కోట్ల డిమాండ్ ఉండే ట్రేడ్ లైసెన్స్‌లకు రూ.30లక్షలతో సరి - కలెక్టర్ ఆదేశించినా యంత్రాంగంలో కదలిక శూన్యం

కోల్‌సిటీ, మార్చి 3 : రామగుండం నగరపాలక సంస్థకు ఆదాయం లేక 1వ తేది వచ్చిందంటే కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కార్పొరేటర్లకు సైతం గౌరవ వేతనానికి ఖజానాలో కాసులు లేని పరిస్థితి. ఆర్థిక సంక్షోభంలో ఉన్న నగర పాలక సంస్థ ఆదాయం పెంపుపై దృష్టి పెట్టడం లేదు. భౌగోళికంగా రామగుండం నగరపాలకసంస్థలో భారీ భవనాలు లేక పోవడంతో ఆస్తి పన్ను డిమాండ్ రూ.8కోట్లే ఉంది. ప్రభుత్వరంగ సంస్థలు, ఇళ్ల యజమానుల నుంచి ఏటా రూ.12.5కోట్లు వసూళ్లు అవుతాయి. నిర్మాణ అనుమతుల ఫీజులు రూ.6.5కోట్ల నుంచి రూ.8కోట్లు వసూలవుతాయి. కానీ వ్యయం మాత్రం భారీగా ఉంటుంది. ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలకే ఏటా రూ.14.5 కోట్లు వెచ్చించాల్సి ఉంది. వాహనాల ఇంధనానికే రూ.2.5కోట్లు వ్యయం అవుతుంది. ఇక అభివృద్ధి పనులకు నగరపాలక సంస్థ నిధులు లేని పరిస్థితి ఏర్పడు తుంది. గతంలో స్టాంప్‌డ్యూటీ, మ్యుటేషన్ ఫీజులు, ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్‌లు, వీఎల్‌టీ తదితర ఆదాయం వచ్చేది. గత ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలతో ఆదాయం నేరుగా ప్రభుత్వ ఖజానాకే వెళుతోంది. ప్రత్యామ్నాయంగా అంతర్గంగా ఆదాయం పెంచుకోవడ మే మార్గమైంది. దీనిపై దృష్టి పెట్టడంలో నగర పాలక సంస్థ యంత్రాంగం విఫలమవుతోంది. ముఖ్యంగా ట్రేడ్‌లైసెన్స్‌లు, అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్‌లు, మార్కెట్లలో అద్దె వసూళ్ల ద్వారా ఆదాయం పెంచే అవకాశాలున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 147ను అనుసరించరించి ట్రేడ్ లైసెన్స్‌లు రహదారులను బట్టి, వ్యాపారాల వైశాల్యాలను బట్టి నిర్ణయించాల్సి ఉంటుంది. తద్వారా రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఏటా రూ.2.5కోట్ల నుంచి రూ.3కోట్లు ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా వచ్చే అవకాశం ఉంటుంది. నగర పాలక సంస్థ లెక్కల ప్రకారం నగరంలో కేవలం 3600 వ్యాపార దుకాణాలు మాత్రమే ఉన్నట్టు చెబుతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌లు అంటే దీపావళి టపాసుల దుకాణాలు, బార్లకు ఎన్‌వోసీలు, మటన్, చికెన్ దుకాణాలు, ఇతర చిన్నాచితక దుకాణాల నుంచి వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నారు.

● లెక్కలు కడుతున్నా...

వాస్తవానికి రామగుండంలో ఇంత వరకు ఒక్క మద్యం దుకాణం నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేయలేదు. వరంగల్, ఖమ్మం వంటి నగరాల్లో మద్యం దుకాణాల నుంచి లైసెన్స్ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇక ఆసుపత్రులు, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రైస్ మిల్లులు, సామిల్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఫంక్షన్‌హాల్స్, బాంక్వెట్ హాల్స్, వాహనాల షోరూంలు, గోడౌన్‌ల నుంచి ట్రేడ్ లైసెన్స్



రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం

వసూలు చేయడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హోటళ్ల, హాస్పిటల్స్, సామిల్స్‌ల నుంచి స్క్వేర్ ఫీట్‌కు రూ.6చొప్పున వసూలు చేయాల్సి ఉంటుంది. ఒక్కో రెస్టారెంట్ రూ.70వేల నుంచి రూ.80వేలు, రైస్‌మిల్లుకు లక్ష రూపాయలు, ఆసుపత్రులకు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు ట్రేడ్ లైసెన్స్ వసూలు చేసుకునే అవకాశం ఉంది. ఇక ఫంక్షన్ హాల్స్‌కు, ఆసుపత్రులకు ఇప్పటివరకు లెక్కలు కట్టిన పరిస్థితే లేదు. కార్పొషన్ పరిధిలోరి 22 ఫంక్షన్ హాల్స్, 13 బాంక్వెట్ హాల్స్, 21రైస్‌మిల్స్, 22వైన్స్‌లు, 47 హాస్పిటల్స్, 10బార్లు ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. వీటి నుంచి ట్రేడ్‌లైసెన్స్ వసూలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వ్యాపారాల నుంచి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేస్తున్నారు. రామ గుండంలో మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ పరిస్థితి మరీ అధ్వానం. కలెక్టర్ స్వయంగా ఆదేశించినా యం త్రాంగంలో కదలిక లేదు. కార్పొరేషన్ పరిధిలో 156మాత్రమే హోర్డిం గ్స్ ఉన్నట్టు లెక్కలు కట్టారు. రూ.18లక్షల డిమాండ్‌కు రూ.6లక్షలు వసూలు చేశారు. వాస్తవానికి అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ రూ.50లక్షల పైనే ఉండే అవకాశం ఉంది. సాధారణంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థలాలు, రోడ్డు మార్జిన్‌ల లో హోర్డింగ్స్ పెట్టుకునేందుకు టెండర్లు ఇచ్చి ఆదాయం పెంచుకో వాల్సి ఉంది. ఇక మార్కెట్ల అద్దెల వసూళ్లలో సైతం అదే నిస్తేజం. కార్పొరేషన్‌కు చెందిన హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కో షాపునకు లక్షల డిమాండ్ ఉంది. షాపుల ద్వారా అద్దె ఆదాయన్ని రూ.90 లక్షల వరకు పెంచుకుంటామని లెక్కలు కడుతున్నా రూ.15లక్షల నుంచి 17లక్షల వరకే అద్దె వసూళ్లు అవుతున్నాయి. ఇప్పటికైనా ఆదాయం పెంచడంపై రామగుండం నగర పాలక సంస్థ యంత్రాంగం దృష్టి సారిం చాల్సిన అవసరం ఉంది.

మల్లికార్జునస్వామి బోనాల జాతర



ఆత్మకూర్‌లో బోనాలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 3: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో యాదవులు మల్లికార్జున స్వామి బోనాల జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మల్లికార్జున స్వామి ఆలయంలోని స్వామి వారికి నిర్వహకులు అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి దర్శనానికి మండలంలోని ఆయా గ్రామాల్లోని నుంచి భక్తులు బారులు తీరారు. భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనం నెత్తిన ఎత్తుకొని యాదవులు, కురుమ సంఘం సభ్యుల ఒగ్గు డోలు వాయిద్యాలు, శివ సత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా ఆలయానికి బయలు దేరారు. అనంతరం బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ, కురుమ సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 3: నగరంలోని అంబేద్కర్ స్టేడియం వద్ద ఇద్దరు వ్యక్తులను అనుమానంతో అదుపులోకి తీసుకోగా వారి వద్ద గంజాయి పట్టుబడిందని ఒకటో టౌన్ ఎస్ఐ రవి ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ స్టేడియం వద్ద గన్నేరువరం గ్రామానికి చెందిన కొనగాని మధు, మానకొండూర్ మండలం గంగిపెల్లికి చెందిన బల్ల వెంకటేష్ గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జీలుక వెంకటమ్మ(85) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై నడవలేని స్థితిలో ఇంటి వద్దనే ఉంటోంది. పైగా వృద్ధాప్యం తోడవడంతో జీవితంపై విరక్తి చెందిన శనివారం రాత్రి తన ఇంటి పక్కన ఉన్న చేదబావిలో దూకింది. ఆదివారం తెల్లవారుజామున వెంకటమ్మ శవమై తేలింది. మృతురాలి కుమారుడు కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓంకార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులతో పాటు కుమార్తె ఉంది.

ఒంటరితనంతో మహిళ..

గంగాధర, మార్చి 3: గంగాధర మండలం గట్టుబూత్కూర్‌కు చెందిన మహిళ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నేరెళ్ల లక్ష్మి(46) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. లక్ష్మికి ఒక కూతురు కాగా కరీంనగర్‌కు చెందిన యువకుడితో వివాహం చేసింది. ఇంట్లో ఒంటరిగా ఉంటూ గ్రామంలో కూలీ పనులకు వెళ్తుండేది. పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరితనం భరించలేక గ్రామ శివారులోని వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ తరలించారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

ధర్మపురి, మార్చి 3: ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బిసగోని వెంకటేష్ (29) అనే యువకుడు అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం జగిత్యాలకు వెళ్లిన వెంకటేష్ అక్కడే డ్రైవర్‌గా పని చేశాడు. మద్యానికి బానిసై అప్పుల పాలై స్వగ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలో కూడా ఎలాంటి పనిచేయకుండా మద్యం తాగి జీవితంపై విరక్తి చెంది ధర్మపురి పట్టణంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేష్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

జ్యోతినగర్, మార్చి 3: స్థానిక మల్యాపూర్ రోడ్డులోని ఎన్టీపీసీ కాలువలో పడి పిట్టల సురేష్(30) అనే యువకుడు మృతిచెందాడు. కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లిన సురేష్ ప్రమాదవశాత్తు కాలువ పడిపోయి చనిపోయాడు. సురేష్ ఫిట్స్‌తో బాధపడుతున్నట్లు సమాచారం. కాలువలో పడిన సమయంలో ఫిట్స్ రావడంతో చనిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎన్టీపీసీ పోలీసులు పరిశీలించారు. మృతుడి తల్లి బాయమ్మ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ హెడ్ కానిస్టేబుల్ ఎండీ ఖాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పిట్టల సురేష్ (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మార్చి3: మండలంలోని బేతిగల్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న డ్రైవర్ రేగుల భాస్కర్, యజమాని బుడిగే బీరయ్యపై కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

వేడెక్కుతున్న రాజకీయాలు

- 7న సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- వేములవాడలో బహిరంగ సభ
- 12న కరీంనగర్‌లో కేసీఆర్ సభ
- కొనసాగుతున్న బీజేపీ ప్రజాహిత యాత్ర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభ స్థానాల్లో పోటీకి నిలవనున్న అభ్యర్థుల ఎంపిక పూర్తి కాక ముందే అన్ని రాజకీయ పక్షాలు పార్టీ ప్రచారంపై దృష్టి సారించాయి. ఏ పేరుతో సభలు సమావేశాలు ఏర్పాటు చేసినా ప్రధాన ఎజెండా లోక్ సభ ఎన్నికలే. కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి బీజేపీ ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేరును పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది ఇంకా తేలలేదు. పెద్దపల్లి లోక్ సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును ఖరారు చేశారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా ఎవరిని నిలిపేది ఆ పార్టీల నాయకత్వం ఇంకా ప్రకటించలేదు.

● విస్తృతంగా నేతల పర్యటనలు..

బీజేపీ సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన నియోజక వర్గ పరిధిలో ప్రజాహిత యాత్రను చేపట్టి మొదటి విడతను పూర్తి చేసుకుని రెండో విడత పర్యటిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాల్లో 119 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రధాన గ్రామాల మీదుగా పట్టణాల మీదుగా ఆయన యాత్ర పూర్తి చేసుకుని ప్రస్తుతం హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో ప్రజాహిత యాత్ర కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం కాకున్నా ఈ నెల 7న రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనుండడం రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఆయన 7న సిరిసిల్ల జిల్లా ఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి వేములవాడలో శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం గుడి చెరువు మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. ఎన్నికల సమయం కావడంతో ఈ బహిరంగసభ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. కరీంనగర్ లోక్ సభ నియోజక వర్గ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ప్రజలు ఈ బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచార సభగానే దీనిని భావిస్తున్నారు.



ఈ నెల 12న బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో శంఖారావ సభను నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ బహిరంగ సభలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న రెండు పార్లమెంటు స్థానాల అభ్యర్థులను ఆయన ఆదివారం ప్రకటించారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఇప్పటి వరకు ప్రతి కీలక సందర్భంలోనూ కరీంనగర్ ప్రధాన పాత్ర పోషిస్తు వస్తూ ట్రెండ్‌సెట్టర్ జిల్లాగా మారింది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే రాజకీయ వాతావరణం వేడేక్కడాన్ని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు

● రాళ్లవాగు కుడికాలువకు గండి పడ్డ ఫలితం ● అడుగంటిన బావులు, చుక్కనీరు రాని బోర్లు ● మరమ్మతుల కోసం రైతాంగం నిరీక్షణ ● రెండు జిల్లాల పరిధిలో ఉండడంతో జాప్యం


భూషణరావుపేట శివారులో పంటల పొలంలో నెర్రెలుబారిన భూమి


నక్కల ఒర్రె వద్ద తెగిన రాళ్ళవాగు కుడికాలువ(ఫైల్)

కథలాపూర్, మార్చి 3: రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువ కింద సాగయ్యే పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలంలో నీటి ఉధృతి కారణంగా కుడికాలువకు నక్కల ఒర్రె వద్ద గండి పడడంతో నీరంతా వాగులోకి వృథాగా పోతోంది. ఈ నేపథ్యంలో కాలువపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాయకులు గండిని పూడ్చడానికి నిధులు తెచ్చి మరమ్మతులు చేస్తారని ఆశించిన అన్నదాతకు కష్టకాలం వచ్చిపడింది. పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతుండడంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

● అన్నదాత ఆశలకు 'గండి'

నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ అడవుల్లో నిర్మించిన రాళ్లవాగు ప్రాజెక్ట్ వల్ల జగిత్యాల జిల్లాలోని భూషణరావుపేట, కథలాపూర్, ఊట్‌పల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరు అందుతోంది. కుడి కాలువ సుమారు ఏడు కిలోమీటర్లు ఉండగా ఇందులో రెండు కిలోమీటర్లు కమ్మర్‌పల్లి ఇరిగేషన్ విభాగం పరిధిలో ఉంది. మిగిలిన భాగం జగిత్యాల జిల్లా ఇరిగేషన్ పరిధిలోకి వస్తుంది. గండి పడ్డ ప్రాంతం కమ్మర్‌పల్లి అధికారుల పరిధిలోకి వస్తున్న క్రమంలో అంచనాలు రూపొందించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో కుడికాలువ పూర్తిగా జగిత్యాల జిల్లాకు మార్చాలని ఇప్పటికే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులతో చర్చించారు. పూర్తిస్థాయి అంచనాలు వేసి సత్వరమే నివేదిక పంపించాలని ఆదేశించారు. అయితే గండి పడ్డ ప్రాంతంలో మరమ్మతులు చేపడతారేమోననే ఆశతో రబీ సీజన్‌కు సంబంధించి వరి, మిర్చి, మినుము, నువ్వు పంటలు రైతులు సాగు చేసుకున్నారు. ఆ ప్రక్రియకు మోక్షం లభించకపోవడంతో బావులు, బోర్లలో నీళ్లు అడుగంటి సుమారు 200 ఎకరాల మేర పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో రైతులు చేసిన లక్షలాది రూపాయల పెట్టుబడులు నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది.

● మూడు ఎకరాల పొలం ఎండిపోయింది..

పచ్చిమట్ల శ్రీనివాస్, రైతు



రాళ్లవాగు కుడికాలువపై ఆధారపడి మూడెకరాల పొలం సాగు చేసుకున్నాను. కాలువ పక్కనే బావి ఉన్నందు వల్ల భూగర్భజలాలు పుష్కలంగా ఉండేవి. అయితే వర్షాకాలం రాళ్లవాగు కాలువకు గండి పడి నీళ్లన్నీ వాగులోకి పడిపోతున్నాయి. దీంతో బావి పూర్తిగా అడుగంటింది. సుమారు రు. 40 వేలతో బావిలో పూడిక తీసినా ఫలితం కనిపించలేదు. లక్ష రూపాయలకుపైగా నష్టం వాటిల్లింది.

● ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారుల సమన్వయం

గడ్డం చిన్నారెడ్డి, రైతు



రెండు జిల్లాల ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేయడానికి ఎమ్మెల్యే ప్రయత్నం చేయడం శుభపరిణామం. ఇప్పటిదాకా తరచూ తెగిపోతున్న కుడి కాలువకు శాశ్వత మరమ్మతులు చేయని కారణంగా రైతుల పరిస్థితి అగమ్యగోచ రంగా మారింది. ఎమ్మెల్యే అసెంబ్లీలో రాళ్లవాగు మరమ్మతులపై ప్రస్తావించిన నేపథ్యంలో కుడి కాలువ మరమ్మతులకు నోచుకుంటుందని ఆశిస్తున్నాము.

బంగారు నగల బ్యాగ్ అప్పగింత


మహిళకు నగలను అందజేస్తున్న ఏసీపీ కృష్ణ, సీఐ

సుల్తానాబాద్, మార్చి 3: ఓ మహిళ తన బంగారు నగల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోగా, పోలీసులు కొన్ని గంటల్లోనే ఆటోను గుర్తించి బ్యాగ్‌ను బాధిత మహిళకు అందించారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ కృష్ణ వివరాల వెల్లడించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మండల వసంత తన తల్లిగారి గ్రామమైన సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి వచ్చింది. తనకు చెందిన తొమ్మిది తులాల బంగారు నగల బ్యాగ్‌తో ఆదివారం సుగ్లాంపల్లి నుంచి ఆటోలో సుల్తానాబాద్‌కు వచ్చింది. బస్టాండ్‌లో కరీంనగర్ బస్సు ఎక్కే క్రమంలో బంగారు నగల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయింది. వెంటనే వసంత సుల్తానాబాద్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు గోదావరిఖని, కాల్వశ్రీరాంపూర్, కరీంనగర్, పెద్దపల్లి ప్రాంత పోలీసులను అప్రమత్తం చేసి ఆటోలను తనిఖీ చేయించారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి ఆటోను కరీంనగర్ కలెక్టరేట్ వద్ద గుర్తించి తనిఖీ చేయగా నగల బ్యాగ్ లభ్యమైంది. దాన్ని సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత మహిళ వసంతకు ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వినీత, అశోక్ రమేష్ తదితరులు అందజేశారు.

ఈతవనం దగ్ధం

కథలాపూర్, మార్చి 3: మండలంలోని తుర్తిలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఈత వనం దగ్ధమైంది. 163 సర్వే నంబర్‌లో సుమారు 3.24 ఎకరాల్లో ఈతవనం ఉండగా స్థానిక గీతకార్మికులు కల్లు గీసుకుని జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఈతవనం పూర్తిగా కాలిబూడిద కావడంతో గీతకార్మికులు ఉపాధి కోల్పోయారు. దీంతో తమకు దిక్కుతోచని పరిస్థితి దాపురించిందని బాధిత గీతకార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన న్యూరో వైద్యుల రాష్ట్ర సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ ఏకే పురోహిత్

సుభాష్‌నగర్, మార్చి 3: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తు న్న న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో కిమ్స్, నిమ్స్ వంటి ఆసుపత్రులకు చెందిన నిష్ణాతులైన న్యూరో సర్జన్లు, ప్రొఫెసర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన న్యూరో డాక్టర్లు పాల్గొన్నారు. న్యూరో వైద్య చికిత్సలో వస్తు న్న అధునాతన పద్ధతులు, చికిత్స విధానాలు, అత్యాధునిక ఆపరేషన్ విధానాల గురించి వివరించారు. ముగింపు కార్య క్రమంలో డాక్టర్ ఏకే పురోహిత్ ప్రెసిడెన్షియల్ ఓరిటేషన్ ను అందించారు. డాక్టర్ మానస్ పాణిగ్రహి, డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ ద్వారకానాథ్‌లు రెనే ఆసుపత్రిలో మెదడులో కంతి తొలగించడం, వెన్నుపాము అత్యాధునిక ఆపరేషన్లను నిర్వహించారు. ఈ సదస్సును డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ పీవీకే కిషోర్, డాక్టర్ జొన్నల శ్రీనివాస్, డాక్టర్ సంజయ్‌లు పర్యవేక్షించారు.

రుద్రవరం ఆలయాల్లో దొంగల బీభత్సం

వేములవాడ టౌన్, మార్చి 3: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని పలు ఆలయాల్లో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని మల్లన్న స్వామి దేవాలయంలోకి చొరబడి గడ్డపారతో హుండీని పగలగొట్టి నగదును, శ్రీస్వామి వారి వెండి ఆభరణాలను అపహరించారు. హనుమాన్ ఆలయంలో సైతం తాళం పగలగొట్టి హుండీలోని నగదును అపహరించుకుపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. రుద్రవరం గ్రామంలోని ఆలయాల్లో దొంగలు పడి హుండీల్లోని నగదును అపహరించుకు వెళ్లడం ఇది మూడోసారి కావడంతో గ్రామస్థులు భయాందోళనకు గురువుతున్నారని చెబుతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బీజేపీ నాయకుడి మృతి

- పరిహారం చెల్లించాలని నాయకుల డిమాండ్

ఇల్లంతకుంట, మార్చి 3: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు రంగు రమేష్ (41) విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉండే రమేష్ ఉదయం స్నానం చేసి బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పోలీస్‌స్టేషన్ ప్రహరీకి రమేష్ బట్టలు ఆరవేయడానికి ఇనుప వైరును కట్టుకున్నాడు. ప్రహరీ మీదుగా ఎల్‌టీ లైన్ వెలుతోంది. స్తంభానికి ఉన్న డెడ్‌ఎండ్ వైరు వల్ల విద్యుత్ ప్రసరణ జరిగి ఉంటుందని బావిస్తున్నారు. మృతదేహానికి సిరిసిల్లలో పోస్టుమార్టమ్ నిర్వహించి ఇంటికి తీసుకువస్తుండగా బీజేపీ నాయకులు రహీంఖాన్‌పేట గ్రామానికి చేరుకొని వాహనాన్ని నిలిపివేశారు. రమేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహన్ని తరలించేది లేదని తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డికి సమాచారం అందించారు. సెస్ డైరెక్టర్ చేరుకొని పోస్టుమార్టమ్ రిపోర్టు ఆధారంగా సెస్‌సంస్థ తరఫున పరిహారం అందించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.


రమేష్ (ఫైల్)

కుటుంబీకులకు సెస్‌సంస్థలో ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తనపరిధిలో లేనందున తగిన విధంగా అండగా ఉంటానని సెస్ డైరెక్టర్ హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బెంద్రం తిరుపతిరెడ్డి, నాగసముద్రాల సంతోష్, బత్తిని స్వామి, తిప్పారపు శ్రావణ్, మ్యాకల మల్లేశం, దెశెట్టి శ్రీనివాస్, సాయగౌడ్, పున్ని రాజు, వజ్జపల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- 5కే రన్‌కు భారీ స్పందన
- మాధక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ
- హాజరైన యువతీ, యువకులు
- బహుమతులు అందజేసిన కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల క్రైం, మార్చి 3: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఆదివారం ఉదయం నిర్వహించిన 5కే రన్‌కు భారీ స్పందన లభించింది. 5కే రన్‌లో పాలుపంచుకున్న యువతీ, యువకుల్లో ఉత్సాహం, ఉల్లాసం కనిపించింది. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్పీ అఖిల్ మహాజన్ జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా, నేతన్నచౌక్, కొత్తచెరువు, చంద్రంపేట మీదుగా తిరిగి అంబేద్కర్‌చౌరస్తా వరకు సాగింది. 5కే రన్‌లో ఓపెన్ కేటగిరిలో రాహుల్, బాలయ్య, సురేష్, (వీర్నపల్లి), విజయ్‌కుమార్, వకీల్ (రుద్రంగి), రజనీకాంత్, రాజు(ఎల్లారెడ్డిపేట), వినోద్‌కుమార్(రంగినేని ట్రస్టు, సిరిసిల్ల), మహిళల కేటగిరిలో హారిక, మౌనిక, విశాల, మౌనిక (తంగళ్లపల్లి), పోలీస్ విభాగంలో దేవరాజు(ఏఆర్ హెడ్‌క్వార్టర్), శంకర్ (ఎల్లారెడ్డిపేట), రవికుమార్ (మీడియా) విజేతలుగా నిలిచారు. విజేతలకు కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ బహుమతులు, 13 సైకిళ్లు అందజేశారు.

● యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

- కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

మాదక ద్రవ్యాలను నిర్మూలించి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. 5కే రన్‌లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యుతనేనన్నారు. అలాంటి యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని అంధకారంలోకి నెట్టేసుకుంటున్నారన్నారు. భావిజీవితానికి అవరోధంగా నిలుస్తున్న మత్తు పదార్థాలను సమాజం నుండి పూర్తిగా నిర్మూలించడానికి ప్రతీ ఒక్కరు నడుం బిగించాలన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.


5కె రన్‌లో పాల్గొన్న ఎస్పీ, చిన్నారులు


విజేతలకు సైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ యువత పురోగతికి అవరోధంగా నిలుస్తున్న గంజాయి, ఇతర మత్తుపదార్థాలను నియంత్రించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించడంలో భాగస్వామ్యం కావాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై అనారోగ్యం పాలవుతూ బంగారు భవిష్యత్తును కోల్పోవడమే కాకుండా ఎన్నో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేస్తూ తమ చేతలారా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. మత్తుపదార్థాలను నిర్మూలించి యువతను మత్తు అనే మహమ్మారి నుంచి కాపాడుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు అన్ని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయికి అలవాటు పడిన వారిని సన్మార్గంలో నడిపించడానికి డి-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటుచేసి మానసిక వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా ప్రతినిధుల పాత్ర అంత్యంత కీలకమని, యువత గంజాయి, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాల బారిన పడితే కలిగే అనర్థాలపై మీడియా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. 5కే రన్ నిర్వహణకోసం కృషిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు భీం శర్మ, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, కరుణాకర్, శ్రీనివాస్, కిరణ్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


రాఘవపూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో


సుల్తానాబాద్‌లో పోలియో చుక్కలు వేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి


మంథనిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ శంకర్


సుల్తాన్‌పూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ


ఓదెలలో పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది


ధర్మారంలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి సుష్మిత

పల్స్ పోలియోకు స్పందన

పెద్దపల్లి రూరల్, మార్చి 3 : చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి అన్నారు. ఆదివారం పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యురాలు మమత, సిబ్బంది పాల్గొన్నారు. రాగినేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో డాక్టర్ శ్రవణ్‌కుమార్ కుర్మపల్లి, అందుగులపల్లి, అప్పన్నపేట గ్రామాల్లో పల్స్ పోలియోను పరిశీలించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఓదెల : మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం ప్రారంభమైన పల్స్ పోలియో చుక్కల మందుకు మంచి స్పందన లభించింది. కొన్ని గ్రామాల్లో మహిళలు కూలి పనులను మానుకొని తమ బిడ్డలకు పోలియో చుక్కలను వేయించారు. మండలంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి చుక్కల మందులు వేయించారు. ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో 14 కేంద్రాలను ఏర్పాటు చేసి, 1943 మంది చిన్నారులకు మందులు వేయగా, అలాగే కొలనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 12 కేంద్రాలను ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో 78 మంది వైద్య సిబ్బంది, అలాగే అంగన్వాడి ఉపాధ్యాయురాళ్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం : ధర్మారం మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్యాధికారి సుష్మిత ప్రారంభించారు. మండలంలో ఏర్పాటు చేసిన 25 పల్స్ పోలియో కేంద్రాల్లో 2630 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అదేవిధంగా బస్‌స్టేషన్‌లో, బస్టాప్, ప్రధాన రహదారులపై పల్స్ పోలియో కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేసి 5ఏళ్ల పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ దామోదర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలిగేడు : పోలియో చుక్కలు వేసి బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉంటుందని ఎంపీపీ తానపర్తి స్రవంతిమోహన్‌రావు అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. కాగా మండలంలోని 12గ్రామాల్లో 17బూతులు ఏర్పాటు చేశారు. 70మంది సిబ్బంది పాల్గొని పోలియో చుక్కలు వేశారు. ప్రాథమిక వైద్యశాల గ్రామపంచాయతీ ప్రాంగణంలో, పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 5తేదీ వరకు 5సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిస్సిక్రిస్టియాన, ఏఎన్ఎం, ఆశాలు, హెల్త్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమీషనర్ వేణుమాదవ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. దేవునిపల్లిలో ఎంపీపీ బాలాజీరావు చుక్కల మందును పంపిణీ చేశారు. అలాగే పట్టణంతోపాటు గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో చుక్కల మందు పంపిణీ చేశారు.

జూలపల్లి : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోను ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రాథమిక వైద్యుల పర్యవేక్షణలో వైద్యఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐదేండ్ల లోపు అర్హులైనా చిన్నారులకు ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన పల్స్‌పోలియో కేంద్రాల్లో పోలియో చుక్కలను వేసారు. మాజీ సర్పంచులు, పలువురు నాయకులు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకుర్తి : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలను ఆదివారం వైద్యాధికారులు, సిబ్బంది అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంథని : మంథని బస్టాండ్ ప్రాంగణంలో, మండలం లోని గద్దలపల్లి పీహెచ్‌సీలో పల్స్ పోలియో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఎంపీపీ కొండ శంకర్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మిడి స్వరూప్ రెడ్డి, ఎంపీటీసీ పెండ్లి చైతన్య ప్రభాకర్ రెడ్డి, ఆర్బీసీ నాయకులు కేకే రెడ్డి, మాజీ సర్పంచ్ ఐలి శ్రీనివాస్, డాక్టర్ సృజన్, సిహెచ్‌ఓ మేరీ సంపూర్ణ, హెచ్ఈఓ శ్రీనివాస్, ఫార్మసీ విజయేందర్, ఏఎన్ఎం కవిత, హెల్త్‌అసిస్టెంట్ దామోదర్, వైద్యులు పాల్గొన్నారు.

ముత్తారం : మండలంలోని సీతంపల్లెలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అడవి శ్రీరాంపూర్‌లో ఎంపీటీసీ దొడ్డ గీతారాణి బాలాజీ, సర్వారంలో ప్రభుత్వ వైద్యాధికారి అమరేందర్‌రెడ్డి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వివిధ గ్రామాల్లో ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పోలియో చుక్కలు వేశారు. హెల్త్‌ఎక్స్‌టెన్షన్ అధికారి నరసింహారెడ్డి, సూపర్‌వైజర్స్ వీరేశం, లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: మండల కేంద్రంలోని బుధవారంపేట(రామాయపల్లి)లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ ఆరెల్లి దేవక్కకొమురయ్య గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రదీప్, కుమార్, మాజీ సర్పంచ్ దేవునూరి రజిత శ్రీనివాస్, హెల్త్‌సూపర్‌వైజర్ కళావతి, శ్రీదేవి, భారతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో బీఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్

- మేయర్ బంగితోపాటు 15మంది కార్పొరేటర్లు 'హస్తం' గూటికి
- నేడు సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కోల్‌సిటీ, మార్చి 3: బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 'హస్త'గతం కాబోతుంది. బీఆర్‌ఎస్‌కు చెందిన మేయర్ బంగి అనీల్‌కుమార్‌తోపాటు ఆ పార్టీకి చెందిన 15మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో సోమవారం వారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలువనున్నారు. అనంతరం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షి సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆదివారమే మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు సాగంటి శంకర్, దాతు శ్రీనివాస్, కొమ్ము వేణు, బాల రాజ్‌కుమార్, మేకల సదానందం, పులేందర్, దుబాసి లలిత, వేగోళపు రమాదేవి, నీల పద్మ, గణముక్కుల మహాలక్ష్మి, దొంతు శ్రీనివాస్, పొన్నం విద్య, కల్వల శిరీష తదితరులు హైదరాబాద్‌లో మకాం వేశారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 50మంది కార్పొరేటర్లకు ఎన్నికల్లో 11కాంగ్రెస్, 18బీఆర్‌ఎస్, 9 ఫార్వర్డ్ బ్లాక్, 6బీజేపీ మిగతావి స్వతంత్రులు గెలుచుకున్నారు. అనంతరం జరిగిన పరిణమాల్లో బీజేపీ, ఫార్వర్డ్‌బ్లాక్ కార్పొరేటర్లు మొత్తం బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 40మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఎన్నికలకు ముందే పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● బయటకుపోయిన వారికి నో ఛాన్స్..

కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన కార్పొరేటర్లకు తిరిగి కాంగ్రెస్ గూటికి రావడానికి బ్రేకులు పడుతున్నాయి. వారి చేరిక ప్రతిపాదనను క్యాడర్ సైతం వ్యతిరేకిస్తుంది. ఎన్నికల సమయంలో తాయిళాలతో వారు పార్టీ మారినట్టు ప్రచారం జరిగింది. పార్టీ అభ్యర్థిపై వ్యక్తిగతంగా దూషణలు చేయడం దూరం పెంచింది.

● నిధుల మంజూరుతో కార్పొరేటర్ల క్యూ..

రామగుండం నగరపాలక సంస్థకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించడంతో కార్పొరేటర్లు ఆ పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. టీయూఎఫ్ఐడీసీతో పాటు డీఎంఎఫ్‌టీ తదితర నిధులు కార్పొరేషన్‌కు మంజూరు కావడంతో డివిజన్లలో అభివృద్ధి ఊపందుకోనున్నది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ గూటికి చేరడమే మార్గంగా పలువురు కార్పొరేటర్లు భావిస్తున్నారు.

● చేరికలపై స్క్రీనింగ్..

బీఆర్‌ఎస్‌కు చెందిన కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్పించుకోవడంలో ఆ పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ మేరకు స్క్రీనింగ్ కూడా జరుగుతోంది. దళిత బంధు, ఇతర వసూళ్లతో సంబంధం ఉన్న కార్పొరేటర్లను చేర్చుకోరాదనే నిర్ణయానికి వచ్చారు. దీనికి తోడు కాంగ్రెస్‌కు బద్ధవ్యతిరేకంగా పని చేసిన కార్పొరేటర్లను అంతే దూరంలో ఉంచాలనే నిర్ణయాకి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ పరిణామాల్లోనే ఆదివారం కాంగ్రెస్‌లో చేరేందుకు రాజధానికి వెళ్లిన ఇద్దరు కార్పొరేటర్లకు గ్రీన్ సిగ్నల్ లభించకపోవడంతో వెనుదిరిగారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఏసీపీ విచారణ

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: మండలంలోని వెన్నంపల్లిలో ఆదివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏసీపీ గజ్జి కృష్ణ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఈర్ల అజయ్ గత నెల 15న పెద్దపల్లికి వెళుతుండగా వెన్నంపల్లి శివారులో బైక్ స్కిడ్‌కావడంతో గ్రామానికి చెందిన కారుపాకల శ్రీకాంత్ ఆటోపై పడిపోయాడు. దీంతో శ్రీకాంత్ తనను కులం పేరుతో తిట్టాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఏసీపీ విచారణ చేపట్టినట్టు ఎస్ఐ ఓకాంర్ తెలిపారు.

6 నుంచి మల్లికార్జునస్వామి ఉత్సవాలు

ఫైటింక్లయిన్‌కాలనీ, మార్చి 3: శివరాత్రి సందర్భంగా నాగుల మల్లికార్జున స్వామి ఉత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం శ్రీనాగుల మల్లికార్జునస్వామి రాజరాజేశ్వర స్వామి వారి ప్రతిమలను ఉదయం 8.30గంటలకు గంగాజలాభిషేకం కోసం తీసుకెళుతామని తెలిపారు.

గాయత్రిలో ఫేర్వెల్ డే

పెద్దపల్లి కల్చరల్, మార్చి 3 : గాయత్రి విద్యానికేతన్ ఫేర్వెల్ డే ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్-రజని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న కొప్పుల శంకర్, ఇనుముల సతీష్

కళ్యాణ్‌నగర్, మార్చి 3: గోదావరిఖనికి చెందిన చైతన్య మానవ వేదిక స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొప్పుల శంకర్‌కు బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందజేశారు. బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డును ప్రదానం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా గోదావరిఖనిలో చైతన్య మానవ వేదిక అనేక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి పలు సామాజిక సేకా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో శంకర్‌కు ఈ అవార్డు లభించింది. శంకర్‌కు అవార్డు రావడంపై సంస్థ అధ్యక్షులు మాదాసు శ్రీనివాస్, ముష్కె రవికుమార్, నూతి సురేష్, వంశీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, నాయిని ఓదెలు, గుంపుల తిరుపతి, ఫజల్ బేగ్, దొబ్బల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

మంథని : మంథనికి చెందిన సంఘ సేవకులు, వికలాంగుల హక్కుల సంఘం నాయకుడు ఇనుముల సతీష్‌కు సేవారత్న నేషనల్ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. బహుజన రైటర్స్ కాన్ఫరెన్స్ సందర్భంగా అవార్డు సెలెక్షన్ కమిటీ చైర్మన్ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, పెద్దపల్లి మాజీ ఎంపీ చెలిమెల సుగుణ కుమారి, సింగరేణి జీఎం లలిత్ కుమార్‌లు సతీష్‌ను ఘనంగా సన్మానం చేసి అవార్డు పత్రాన్ని, షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పట్ల శ్రీనివాస్, ఎలిశెట్టి అనిత, లోకే రాము, మున్సిపల్ కౌన్సిలర్లు సీపతి బానయ్య, కుర్ర లింగయ్య, మాజీ సైనికుడు మామిడాల సంతోష్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆయిలి శ్రీనివాస్, చకినాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి


రోగులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 3: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు అందించడంలో అధికారులు విఫలమయ్యారని టీడీపీ రాష్ట్ర నాయకులు నిమ్మకాయల ఏడుకొండలు ఆరోపించారు. ఆదివారం టీడీపీ బృందం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కొద్ది రోజులుగా తాగడానికి మంచినీరు రావడం లేదని, రోగులు బయటనుంచి మంచినీటిని కొనుక్కుటున్నారన్నారు. రోగులకు బెడ్‌షీట్లను వేయడం లేదని, బెడ్లను దగ్గర వేయడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. న్యూరో డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కంది చంద్రయ్య, దామోదర్‌రెడ్డి, చల్లా రవీందర్, రాయనర్సు, వీరేందర్, కిరణ్, స్వరాజ్యం, కళావతి, అశ్విని, బాణమ్మ, లక్ష్మి ఉన్నారు.

ఎట్టకేలకు కిష్టంపేట-బూర్నపల్లి బ్రిడ్జికి మోక్షం

- రోడ్లను అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రానికి ముఖ్యమంత్రి వినతి - త్వరలో తీరనున్న మండల ప్రజల కష్టాలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3 : ఎట్టకేలకు మండలంలోని కిష్టంపేట, బూర్నపల్లి మధ్యన ఉన్న మానేరుపై బ్రిడ్జికి మోక్షం లభించనున్నది. ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్రం పచ్చజెండా ఊపడంతో రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అందులో జగిత్యాల, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, కిష్టంపేట మీదుగా కాల్వపల్లి, మొరంచపల్లి, రామప్పదేవాలయం, జంగాలపల్లి వరకు 164 కిలోమీటర్లు జాతీయ రహదారిగా విస్తరింపచేయాలని రేవంత్‌రెడ్డి వినతిపత్రం ఇవ్వడంపై మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి కావడం వల్ల మండలం వాణిజ్యపరంగా అభివృద్ధి కావడంతో పాటు భూపాలపల్లి, పర్కాల, మేడారం జాతర, రామప్పదేవాలయం దగ్గరవుతుంది. కిష్టంపేట, బూర్నపల్లి మధ్య మానేరుపై బ్రిడ్జి నిర్మాణంకు పది సంవత్సరాల క్రితం బీజం పడింది. అప్పటి మాజీ ఎంపీ జంగారెడ్డి బ్రిడ్జి నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధంచేసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లారు. కేంద్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి సంబంధిత అధికారులతో సర్వే కూడా చేయించింది. అయితే బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనల వరకే నిలిచిపోయింది. బ్రిడ్జి నిర్మాణం జరిగితే కరీంనగర్, పెద్దపల్లి నుంచి భూపాలపల్లి, పర్కాల బస్సు సౌకర్యం మెరుగవుతుంది. దీంతో మానేరుకు ఇరువైపులా ఉన్న మండలాల ప్రజలకు ప్రయాణం సులువవుతుంది. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల ప్రజలు భూపాలపల్లి, పర్కాలకు వెళ్లానుకుంటే జమ్మికుంట నుంచి పెద్దపల్లి, మంథని ద్వారా వెళ్లాల్సి వస్తోంది. దీంతో సమయానికి బస్సులు గానీ, ప్రైవేట్ వాహనాలు గానీ సరిగా ఉండక


కిష్టంపేట, బూర్నపల్లి మధ్య మానేరు నదిలో వేసి తాత్కాలిక మట్టి రోడ్డు

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా మానేరు అవతల మండలాలు టేకుమట్ల, రేగొండ, చిట్యాల మండలాల ప్రజలు వేములవాడ, ఓదెల మండల కేంద్రంలో ఉన్న మల్లికార్జున స్వామి దేవస్థానాలకు దర్శనాలకు వస్తుంటారు. వారు కూడా రావడానికి రవాణా సౌకర్యాలు లేక జమ్మికుంట, కరీంనగర్ ద్వారా వెళుతుంటారు. ఓదెల దేవస్థానానికి రైలు ద్వారా వస్తుంటారు. బ్రిడ్జి నిర్మాణం జరిగితే మానేరు అవతల మండలాల ప్రజలకు ప్రయణం సులువవుతుంది. వెంటనే రహదారి నిర్మాణ పనులు మొదలయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'స్థానికేతరులతో అభివృద్ధికి నోచుకోని పెద్దపల్లి'


ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తున్న నతానియేలు

పెద్దపల్లి టౌన్, మార్చి 3: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి ఇప్పటి వరకు స్థానికేతరులు ఎన్నిక కావడం వల్లే అభివృద్ధికి నోచుకోలేదని ఓదెల మండలం కొలనూర్ వాస్తవ్యులు, ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ నతానియేలు అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్థానికుడిగా వచ్చే ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ బరిలో ఉంటానని తెలిపారు. ఈప్రాంత నదులు, జలాలు, సహజ వనరులపై అవగాహన ఉందన్నారు. ప్రజల అభీష్టం మేరకు విద్య, వైద్య, ఉపాధి రంగాలను అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. విద్యావంతులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగస్తులు, యువత తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఈసందర్భంగా తన ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. సమావేశంలో డాక్టర్ ఏకు తిరుపతి, కర్రె మహేందర్‌రెడ్డి, మార్వాడి సుదర్శన్, జంగ మహేందర్‌రెడ్డి, బత్తుల చంద్రమౌళి, దొడ్డె బాపు, కర్రె రవీందర్, కోరుకంటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

31న ఉద్యోగులకు ఆత్మీయ సన్మానం

పెద్దపల్లి టౌన్, మార్చి 3: ఈనెల 31న పెద్దపల్లి మండలం నిట్టూర్ గ్రామంలో ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మన ఊరు-మన జ్యోతి-మన ఉద్యోగులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమళ్ల శంకర్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పూలే, అంబేద్కర్ సేవారత్న అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పోగుల వెంకటేశం, మల్లయ్య, ఎంపీటీసీ దొంత రాజయ్య, గుండేటి ప్రభాకర్, కుక్క వెంకట స్వామి, క్యాదాసి రాజేశం, బొంకూరి రాజేశం, పొనగంటి రాజనర్సు, దాసరి రామస్వామి, కల్వల ఐలయ్య, లింగమల్ల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10న మంత్రి పొన్నంకు గౌడ సంఘాల సన్మానం

జ్యోతినగర్, మార్చి 3: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఈనెల 10న కరీంనగర్‌లో గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిస్తున్నట్లు సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్య గౌడ్ తెలిపారు. ఆదివారం ఎన్టీపీసీలో జరిగిన విలేకరుల సమావేశంలో సత్తయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గౌడ కులస్థుల సంక్షేమం కోసం కృషి చేసిన మంత్రి పొన్నంను సన్మానించేందుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని గౌడ్ సంఘాలు ముందుకు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సన్మాన పోస్టర్‌ను విడుదల చేవారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు కోల లక్ష్మణ్ గౌడ్, ముఖ్య సలహాదారుడు పెద్దంపేట శంకర్, నాయకులు అన్నయ్యగౌడ్, బుగ్గ రాములు గౌడ్, పొన్నం అంజయగౌడ్, రాములుగౌడ్, సంత్తయ్యగౌడ్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరస్వామి ఆలయ కమిటీ

ధర్మారం, మార్చి3: మండలంలోని నందిమేడారంలోగల శ్రీఅమరేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ఏకగ్రవంగా ఎన్నికైంది. ఆదివారం ఆలయ ఆవరణలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో బాగంగా గ్రామస్థుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షునిగా చిప్ప మణిశర్మ, ఉపాధ్యక్షులుగా మానుపాటి బాలు, శాఖపురం కొమురేష్, ప్రధాన కార్యదర్శిగా తమ్మనవేని మహేష్, కార్యదర్శులుగా కందుకూరి రాముకుమార్, నర్సింగం, బొడ్డు రవి, కాంపెల్లి రాజు, పంజాల శ్రీనివాస్‌లతోపాటు 17మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులగా కట్టసరోజస్వామి, మిట్ట తిరుపతి, కట్ట రమేష్, నేరెళ్ల చిన్న లచ్చయ్య, సింగిరి రవికుమార్, ముఖ్య సలహాదారుగా రాచూరి మల్లారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీజీటీలో ఎంపికైన ఉపాధ్యాయులకు సన్మానం

ధర్మారం, మార్చి3: టీజీటీలో ఎంపికైన ఉపాధ్యాయులను ఆదివారం ధర్మారంలోని సాందీపని పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంపికైన సుచిత్ర, మహిపాల్‌మహేష్, భవానిసింగ్‌లను తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం మండల శాఖ నాయకులు సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆవుల రాజేష్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ మూర్తి, మండల శాఖ అధ్యక్షుడు కోవిఆర్, ప్రధాన కార్యదర్శి కోల శ్రీనివాస్, పాఠశాల నిర్వాహకుడు పూస్కూరి రామారావు, టీపీటీఎఫ్ సభ్యులు రాజేందర్, రాజశేఖర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఖని మహిళ


రమాదేవి

కోల్‌సిటీటౌన్, మార్చి 3: గోదావరిఖని తిరుమల నగర్‌కు చెందిన బేతి రమాదేవి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ఇటీవల ప్రకటించిన తెలంగాణ సంక్షేమ గురుకులాల్లో పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు రమాదేవి ఎంపికైంది. భర్త ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించానని రమాదేవి పేర్కొన్నారు. ప్రస్తుతం రమాదేవి మంచిర్యాల జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ (కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్)గా విధులు నిర్వహిస్తున్నారు.

'జిల్లాకు శ్రీపాదరావు పేరు పెట్టాలి'

పెద్దపల్లి టౌన్, మార్చి 3: పెద్దపల్లి జిల్లాకు స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ కోరారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాలకుర్తి, మార్చి3: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామ శివారు బొందలగడ్డ ప్రాంతంలో పేకాట శిబిరంపై ఆదివారం బసంత్ నగర్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 3560 రూపాయలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆర్.స్వామి తెలిపారు.

'ఎన్నికల హామీలను నెరవేర్చుతాం'


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, మార్చి 3: గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఎన్నికల హామీలను నెరవేర్చుతామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్‌లో పది లక్షల రూపాయల ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో నెరవేరుస్తానని అన్నారు. సీసీరోడ్డు విస్తరణ కోసం నిధులు కావాలని, కుమ్మరి సంఘంకు కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని మాజీ సర్పంచ్ కవ్వంపల్లి జమున తిరుపతి ఎమ్మెల్యేను కోరారు. అనంతరం మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు, సీఐ సుబ్బారెడ్డితో పాటు తాజా మాజీ సర్పంచ్ కవ్వంపల్లి జమున తిరుపతి, మినుపాల ప్రకాష్‌రావు నాయకులు బల్మూరి వెంకటరమణారావు, బొల్లం లక్ష్మన్, వెంకన్న, పోచంపల్లి లచ్చయ్య, కవ్వంపల్లి లచ్చయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.